

ఆపరేషన్ ముస్కాన్

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలన్న లక్ష్యంతో ఆపరేషన్ ముస్కాన్, ఆపరేషన్ స్మైల్ ఏడేళ్ల క్రితం అమల్లోకి వచ్చాయి. అధికారుల ప్రత్యేక బృందాలు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ కేసులు నమోదు చేస్తున్నాయి. 8లో▸



పోస్టర్ ఆవిష్కరణ

పెద్దపల్లిరూరల్: సీపీఎస్ రద్దు చేయాలని కోరుతూ జిల్లాలో ఈనెల 22న మంథని, 23న పెద్దపల్లికి చేరుతున్న రథయాత్ర పోస్టర్‌ను సోమవారం పీఆర్‌టీయూ, ఓపీఎస్ సాధన నాయకులు ఆవిష్కరించారు.

గరిష్టం/కనిష్టం
28.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో చిరుజల్లులు, మరికొన్ని చోట్ల మోస్తరు వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

అస్తవ్యస్తంగా కార్పొరేషన్ రోడ్లు



నిరసన తెలుపుతున్న రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: కార్పొరేషన్ రోడ్లు అస్తవ్యస్తంగా మారాయని, అభివృద్ధిలో పాలకపక్షం పూర్తిగా విఫలమైందని డీసీసీ అధ్యక్షుడు రాజ్‌ఠాకూర్ అన్నారు. సోమవారం స్థానిక కళ్యాణ్‌నగర్, లక్ష్మీనగర్ ఏరియాలో రోడ్లు, డ్రైనేజీలను మరమ్మతు చేయాలని రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. కార్పొరేషన్ ప్రధాన వ్యాపార కూడలి రోడ్లు దారుణంగా మారాయన్నారు. ఎమ్మెల్యే, మేయర్ కమీషన్లకు కక్కుర్తిపడి కాంట్రాక్టర్లు, అధికారులపై ఒత్తిడికి గురిచేస్తూ పనులు తాత్సారం చేస్తున్నారన్నారు. రోడ్డు మీదుగా ఆటో, అంబులెన్స్‌లో ఆసుపత్రికి చేరేలోపు తుదిశ్వాస విడిచే పరిస్థితి ఉందన్నారు. నాయకులు దశరథం, కాల్వ లింగస్వామి, మహంకాళిస్వామి, ఎండీ ముస్తాఫా, గట్ల రమేష్, తాళ్లపెల్లి యుగేందర్, చుక్కల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఒంటికాలిపై నిల్చొని నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న పంచాయతీ కార్మికులు

పెద్దపల్లిరూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. జిల్లాకేంద్రంలోని అమరవీరుల స్తూపం వద్ద 12 రోజులుగా నిరవధిక సమ్మెకు దిగిన పంచాయతీ కార్మికులు సోమవారం ఒంటికాలుపై నిల్చొని నిరసన వ్యక్తం చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఖాజా డిమాండ్ చేశారు. నాయకులు తిరుపతి, సత్యనారాయణ, రాజయ్య, ముస్తఫా, అశోక్, కనుకయ్య, రాజేశ్వరి, దీపిక, శంకరమ్మ, రహీం, నర్సయ్య, మహేందర్, శ్రీకాంత్ తదితరులున్నారు.

పార్వతీబ్యారేజీలో 6.426 టీఎంసీల నీరు



పార్వతీ బ్యారేజీలో నీటి మట్టం

మంథని: మంథని మండలంలోని పార్వతీబ్యారేజీలోకి సరస్వతి పంప్‌హౌజ్ నుంచి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. సరస్వతి పంపుహౌస్ ఫోర్‌బేలో 117.40 మీటర్ల నీరు నిల్వ ఉంది. మూడు పంపుల ద్వారా 8,793 క్యూసెక్కుల నీటిని పార్వతీ బ్యారేజీలోకి ఎత్తిపోస్తున్నారు. బ్యారేజీ సామర్థ్యం 8.83 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 6.426 నీరు నిల్వ ఉంది.

ఉత్తరాలు మరింత వేగంగా చేరవేత



పోస్టల్ మానిటరింగ్ మెయిల్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న ప్రభాకర్

పెద్దపల్లిరూరల్: ప్రజలు తమ అవసరాల నిమిత్తం పంపించే ఉత్తరాలు, కవర్లను మరింత వేగంగా చేరవేసేందుకు జిల్లాకేంద్రంలో మెయిల్ మానిటరింగ్ యూనిట్‌ను సోమవారం నుంచి అందుబాటులోకి తెచ్చినట్లు పోస్టల్ సూపరింటెండెంట్ పసునూరి ప్రభాకర్ తెలిపారు. జిల్లాకేంద్రంలోని పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయంలో మెయిల్ మానిటరింగ్ యూనిట్‌ను ఆయన ప్రారంభించారు. ఉత్తరాలను బట్వాడాలో జాప్యం జరగకుండా.. త్వరితగతిన చేరవేసేందుకు ఈ మెయిల్ మానిటరింగ్ యూనిట్ దోహదపడుతుందన్నారు. ప్రజలందరూ స్పీడ్ పోస్ట్, రిజిస్టర్ పోస్ట్ ఉత్తరాలు పంపించేటప్పుడు చిరునామాతోపాటు ఎవరికైతే పంపిస్తున్నారో వారి మొబైల్ నంబర్ కూడా కవర్‌పై రాయాలని సూచించారు. అప్పుడే ఉత్తరాలను త్వరితగతిన చేరవేయడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

> 'మా ఇంట్లో ఆ పార్టీ ఈ పార్టీ అంటూ నేతల చుట్టూ తిరిగే వాళ్లు లేరు. బతుకుదెరువు కోసం కులవృత్తి చేసుకుంట పొట్టపోసుకుంటున్నం. ప్రభుత్వం బీసీలకు రూ.లక్ష సాయం చేస్తుందంటే దరఖాస్తు చేసుకున్నం. ఎమ్మెల్యే సిఫార్సు ఉంటేనే ఇస్తారట. మా సర్పంచ్‌ను అడిగితే కమీషన్ ఇస్తే ఎమ్మెల్యేతో చెప్పి జాబితాలో పెట్టిస్తా అంటున్నాడు. పైరవీకారులకే కట్టబెట్టేలా అనిపిస్తున్నది..' – ఓ దరఖాస్తుదారుడి ఆవేదన

> బీసీల్లో చాలామంది నిరుపేదలున్నారు. అందులో మొదటి విడత కింద 300 మందిని ఎంపిక చేస్తే ఎన్నికల వేళ మంచికంటే చెడే ఎక్కువ అయ్యేలా కనిపిస్తంది. ఇప్పటికే డబుల్ బెడ్రూం, దళితబంధుతో ప్రజల్లో వ్యతిరేకత ఉంది. అధికారులు ఇచ్చిన జాబితాలో తొలివిడత కింద 300 మందిని ఎంపికచేస్తే మిగితావారు అసంతృప్తికి గురయ్యే అవకాశాలున్నాయి. – ఓ ప్రజాప్రతినిధి గుబులు

బీసీ సాయం.. ఆలస్యం

- జిల్లాలో మొదలుకాని ప్రక్రియ
- లబ్ధిదారుల జాబితాలో ఎవరి పేరో..?
- మల్లాగుల్లాలు పడుతున్న నేతలు
- ప్రజాప్రతినిధుల అనుచరులకే ప్రాధాన్యత



కరీంనగర్‌లో ఈనెల 15న బీసీ సాయం పంపిణీ చేస్తున్న మంత్రి గంగుల కమలాకర్

సాక్షి, పెద్దపల్లి: వెనుకబడిన తరగతుల్లోని చేతివృత్తులవారికి రూ.లక్ష ఆర్థిక సాయం ఇస్తామని ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన విషయం తెల్సిందే. దీంతో వేలాది మంది దరఖాస్తు చేసుకున్నారు. మొదటి విడతలో ప్రతి నియోజకవర్గానికి 300మంది అర్హులకు సాయం అందిస్తామని, ఈనెల 15న ప్రజాప్రతినిధుల చేతులమీదుగా పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పలు జిల్లాలో ఈ పథకం ద్వారా లబ్ధిదారులకు రూ.లక్ష ఆర్థికసాయం అందించగా.. మన జిల్లాలో మాత్రం ఇంకా మొదలుకాలేదు. అర్హులను ఎంపికచేయడంలో ప్రజాప్రతినిధులు మల్లాగుల్లాలు పడటంతోపాటు, నిధుల సమస్యే కారణంగా తెలుస్తోంది. దీంతో ఎంతో ఆశగా ఎదురుచూస్తున్న లబ్ధిదారులు నిరాశకు లోనవుతున్నారు.

360డిగ్రీ సాఫ్ట్‌వేర్‌తో అర్హుల లెక్క

బీసీల్లో చాలా కులాలు ఉండటంతో ప్రభుత్వం కేవలం 14కులాలకు చెందిన వారినుంచే దరఖాస్తులు స్వీకరించింది. అందులోనూ అత్యంత నిరుపేదలకు సాయం అందేలా చూడాలని నిర్ణయించింది. ఐదేళ్లలో రూ.50వేలకు పైబడి బీసీ రుణాలు పొందినవారిని అనర్హులుగా తేల్చింది. అలాగే వారి జీవన పరిస్థితిని క్షేత్రస్థాయిలో ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఎంపీడీవోలు, మున్సిపాలిటీల్లో మున్సిపల్ కమిషనర్లు, అధికారుల బృందం పరిశీలించటంతో పాటు, ఎలాంటి పథకాల్లో లబ్ధిపొందని వారిని గుర్తించేందుకు 360 డిగ్రీ సాఫ్ట్‌వేర్ సాంకేతికతను వినియోగించారు. దీంతో బీసీ సాయం కోసం అన్ని మండలాల నుంచి 10,759 దరఖాస్తులు రాగా, వాటిలో 360డిగ్రీ సాఫ్ట్‌వేర్‌తో 6,797మందిని అర్హులుగా తేల్చారు. వీరిని కలెక్టర్ల ఆమోదంతో ఎమ్మెల్యేలు, మంత్రుల పర్యవేక్షణలో చెక్కులు పంపిణీ చేయనున్నారు.

గ్రామానికి ఒక్కరు, ఇద్దరు

జిల్లాలో 14 మండలాలు, 266 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. రామగుండం కార్పొరేషన్, పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ మున్సిపాలిటీల్లో కలిపి మొదటి విడతలో ప్రతి నియోజకవర్గంలో 300మందికి మాత్రమే సాయం అందించనున్నారు. బల్దియాల్లో ఎక్కువ మందిని, గ్రామాల్లో ఒక్కరిద్దరు చొప్పున లబ్ధిదారులను ఎంపిక చేసేలా ఎమ్మెల్యేలు కసరత్తు చేయడం.. జిల్లా ఉన్నతాధికారుల బదిలీ కావడం.. నిధులు విడుదల కాకపోవడం తదితర కారణాలతో ప్రక్రియ ఆలస్యమవుతున్నట్లు తెలుస్తోంది. దళితబంధు మాదిరిగా అనుచరులు, పైరవీకారులకే ప్రజాప్రతినిధులు ప్రాధాన్యం ఇస్తున్నారనే ఆరోపణలున్నాయి. లబ్ధిదారులను ప్రజాప్రతినిధుల సిఫార్సులతోనే ఎంపిక చేస్తున్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అన్ని అర్హతలున్నా తమకు ప్రజాప్రతినిధి నుంచి సిఫార్సు లేకపోవడంతో అధికారులు రూపొందించిన తొలి విడత జాబితాలో చోటు లభించడం లేదన్న విమర్శలొస్తున్నాయి. ఇదే విషయమై బీసీ సంక్షేమ అధికారి రంగారెడ్డిని వివరణ కోరగా.. జిల్లావ్యాప్తంగా అర్హులైన లబ్ధిదారుల జాబితా రూపొందించే ప్రక్రియ కొనసాగుతోందని, ఒకటి, రెండు రోజుల్లో జాబితా పూర్తి చేసి రూ.లక్ష ఆర్థిక సాయం పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా ఈనెల 25లోగా మొదటి విడత పంపిణీ పూర్తిచేస్తామన్నారు.

అధిష్టానం వద్దకు

రామగుండం పంచాయితీ



బీఆర్ఎస్ నేతలతో ఎమ్మెల్యే కోరుకంటి



మీడియాతో మాట్లాడుతున్న ఆశావహులు

- ఎమ్మెల్యే చందర్‌కు వ్యతిరేకంగా ఆరుగురు నేతలు
- వారిని పార్టీ నుంచి బహిష్కరణకు తీర్మానం
- అధిష్టానం వద్దే తేల్చుకుంటామంటున్న ఆశావాహులు

గోదావరిఖని: రామగుండం నియోజకవర్గంలో అధికారపార్టీలో కొద్దిరోజులుగా జరుగుతున్న పరిణామాలు స్థానికంగా పొలిటికల్ హీట్‌ను పెంచుతున్నాయి. స్థానిక ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ ప్రజాచైతన్యయాత్ర పేరుతో రామగుండంలో పాదయాత్ర చేస్తున్నారు. ప్రజల సమస్యలు తెలుసుకుంటూ ముందుకుసాగుతున్నారు. మరోవైపు వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆసక్తి చూపుతున్న ఆశావహులు ఆరుగురు బృందంగా ఏర్పడి ఎమ్మెల్యేకు పోటీగా 'ప్రజాఆశీర్వాద యాత్ర' పేరుతో పాదయాత్ర చేపట్టారు. ఈ పరిణామంతో అంతర్గతంగా కొనసాగుతున్న పార్టీలోని కుమ్ములాట బహిర్గతం అయినట్లయ్యింది. ఫలితంగా పార్టీకి నష్టం జరిగే అవకాశాలున్నాయని, సమస్యను సద్దుమణిగేలా చూడాలని బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ మేరకు సోమవారం నియోజకవర్గ ప్రజాప్రతినిధులు సమావేశమై ఆశావహులపై చర్యలు తీసుకోవాలని పార్టీ అధిష్టానానికి తీర్మానం చేసి పంపారు. అయితే తాము పార్టీకి ఎక్కడా నష్టం చేయడంలేదని, పార్టీ కార్యక్రమాలను ప్రజలకు చేరవేసేందుకు.. కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎంగా చేసేందుకే పాదయాత్ర చేస్తున్నామని ఆశావహులు మీడియా సమావేశంలో తెలపడం గమనార్హం. దీంతో రామగుండం పంచాయితీ ఎటువైపు దారితీస్తుందోనన్నది ఆసక్తి మారింది.

ఆరుగురిపై బహిష్కరణకు తీర్మానం

ఆశావహులకు వ్యతిరేకంగా ఎమ్మెల్యే అధ్యక్షతన బీఆర్ఎస్ జనరల్ బాడీ స్థానిక ఓ ఫంక్షన్ హాల్‌లో సమావేశమైంది. రెండు గంటలపాటు ఎమ్మెల్యేకు, పార్టీకి నష్టం కలిగించేలా ప్రవర్తిస్తున్న జెడ్పీటీసీ కందుల సంధ్యారాణి, టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, మాజీ మేయర్ కొంకటి లక్ష్మీనారాయణ, నాయకులు పాతిపెల్లి ఎల్లయ్య, కార్పొరేటర్ పాతిపెల్లి లక్ష్మీ, బయ్యపు మనోహర్‌రెడ్డిని ఏమాత్రం ఉపేక్షించొద్దని, అదే జరిగితే వచ్చే ఎన్నికల్లో పార్టీకి నష్టం కలుగుతుందని, వారిని పార్టీ నుంచి బహిష్కరించాలని తీర్మానించారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న క్రమంలో పార్టీకి విధేయులం అంటూనే పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే చందర్‌ను విమర్శించడం పార్టీకి నష్టం కలిగించేలా ఉందని, వెంటనే వారిని సస్పెండ్ చేయాలని కోరారు.

అధిష్టానం వద్దే తేల్చుకుంటాం

ఆశావహులను బహిష్కరించాలని ఎమ్మెల్యే సమావేశం కావటంతో పోటీగా ఆశావహులు మీడియా సమావేశం ఏర్పాటు చేసి అధిష్టానం వద్దే తేల్చుకుంటామని తెలిపారు. రాష్ట్రంలో పార్టీ అనేక అభివృద్ధి చేపడుతుంటే స్థానిక ఎమ్మెల్యే దందాలతో పార్టీని భ్రష్టుపట్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బహిష్కరణ కోసం వారు తీర్మానం చేస్తే భయపడేది లేదని, పార్టీ పెద్దల వద్దనే తేల్చుకుంటామని తేల్చిచెప్పారు. దీంతో ఇరు వర్గాలు పోటాపోటీగా కార్యక్రమాలు, మాటల తూటాలు పేల్చుతుండటంతో ఈ పరిణామాలు ఎటువైపు దారితీస్తాయోనని నియోజకవర్గంలో చర్చకు దారితీసింది. ఎమ్మెల్యే ఆదివారం హైదరాబాద్‌కు వెళ్లి పార్టీ పెద్దలకు స్థానికంగా జరుగుతున్న పరిణామాలను తెలియజేసిన తరువాతే నియోజకవర్గంలో సమావేశం నిర్వహించారని, దీంతో అసమ్మతివాదులపై వేటు పడే అవకాశాలున్నాయని ఎమ్మెల్యే అనుచరులు చెబుతున్నారు. అధిష్టానం ఇరువర్గాలను హైదరాబాద్‌కు పిలిచి మాట్లాడి సమస్య పరిష్కరిస్తుందా..? లేదా..? నేతలపై నేరుగా వేటు వేస్తారా..? సమస్య సద్దుమణిగి నేతలు కలిసికట్టుగా పనిచేస్తారా? లేదా మరికొద్దిరోజుల్లో తేలనుంది.

వెల్‌నెస్ సెంటర్‌ను సందర్శించిన కేంద్రబృందం



ధూళికట్టలోని హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో వివరాలు అడిగి తెలుసుకుంటున్న కేంద్ర బృందం

ఎలిగేడు: మండలంలోని ధూళికట్టలోగల హెల్త్ వెల్‌నెస్ సెంటర్ ఇటీవల కాయకల్ప అవార్డు దక్కించుకుంది. దీంతో సోమవారం ఆ సెంటర్‌ను మండల వైద్యాధికారి నిస్సీక్రిస్టీనా ఆధ్వర్యంలో ఎంక్వాస్ కేంద్రబృందం డాక్టర్ ఈశ్వర్ మసాల్, డాక్టర్ సుబ్రమణ్యయన్ సందర్శించి పలు అంశాలను పరిశీలించారు. సెంటర్‌లో రికార్డులు, ఆరోగ్య కేంద్రం పనితీరు, వైద్యసేవలపై అడిగి తెలుసుకున్నారు. అన్ని జాతీయ కార్యక్రమాలు, రాష్ట్ర ఆరోగ్య కార్యక్రమాలు, కేసీఆర్ కిట్, మలేరియా, ఫైలేరియా, డెంగీ, శానిటేషన్, చేతులపరిశుభ్రత, మందులు, ల్యాబ్ వివరాలు, ఓపీ, కుటుంబ నియంత్రణ పద్ధతులు, ఇంజక్షన్లపై తెలుసుకున్నారు. సీజనల్ అంటువ్యాధులు, వాటినివారణ, పరీక్షలు, చికిత్స విధానంపై ఆరా తీశారు. గ్రామంలోని పలువార్డుల్లో పర్యటించారు.అంగన్‌వాడీ కేంద్రం–3ను సందర్శించి గర్భిణులు, బాలింతలకు అందుతున్న వైద్యసేవలు, పౌష్టికాహారంపై పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ముందుగా కేంద్రబృందం సభ్యులకు సర్పంచ్ కావేరి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. వారివెంట జిల్లా ప్రోగ్రాం అధికారి కృపాబాయి, సీహెచ్‌వో డాక్టర్ శ్రావణి, అనిల్, రాజేందర్, ప్రకాష్, హెల్త్ కమ్యూనిటీ అధికారి విజయేందర్, హెల్త్ ఎడ్యూకేటర్ రాజేశ్వరిదేవి, హెల్త్ సూపర్‌వైజర్ నాగమణి, హెచ్ఎస్ లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త కమిషనర్ వచ్చేనా..?!

- రామగుండం వచ్చేందుకు విముఖత
- కమిషనర్ నాగేశ్వర్ చేరికపై అనుమానాలు?
- బల్దియాలో స్తంభించిన సమస్యలు



కోల్‌సిటీ(రామగుండం): రామగుండం కార్పొరేషన్‌కు వచ్చేందుకు అధికారులు వెనుకడుగు వేస్తున్నారని తెలుస్తోంది. ఇక్కడ స్వేచ్ఛగా పనిచేసే పరిస్థితులు ప్రజాప్రతినిధులు కల్పించలేకపోతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలాంటి ఒత్తిళ్లతోనే కమిషనర్ బి.సుమన్‌రావు సెలవు పెట్టి.. బదిలీ చేయించుకున్నారన్న ప్రచారం జరుగుతోంది. ఆయన స్థానంలో మీర్‌పేట కార్పొరేషన్ నుంచి బదిలీ అయిన సీహెచ్.నాగేశ్వర్ విధుల్లో చేరడానికి ఆలోచిస్తున్నట్లు తెలిసింది. ఇక్కడ రాజకీయ జోక్యం ఎక్కువగా ఉంటుందని, అందుకే వెనకంజ వేస్తున్నారని తెలుస్తోంది. ఈ క్రమంలో తన బదిలీని నిలుపుదల చేయించుకోవడానికి ప్రభుత్వ పెద్దలకు విజ్ఞప్తి చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

20 రోజులుగా స్తంభించిన పాలన

కమిషనర్ లేకపోవడంతో 20 రోజులుగా కార్పొరేషన్ పాలన స్తంభించింది. పారిశుధ్యం గాడితప్పింది. అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. వేతనాల కోసం కార్మికులు, బిల్లుల కోసం కాంట్రాక్టర్లు ఎదురుచూస్తున్నారు. దీనికి తోడు జనన, మరణ విభాగంకు భారీగా దరఖాస్తులు వస్తున్నాయి. ఇప్పటికే సుమారు 350కిపైగా దరఖాస్తులు జారీ చేయాల్సి ఉంది. డిజిటల్ సంతకం చేసే అధికారం కమిషనర్‌కు మాత్రమే ఉండడం, ఆయన లేకపోవడంతో జారీ ప్రక్రియ నిలిచిపోయింది. కార్పొరేషన్‌లోని పలు విభాగాల్లో పనిచేస్తున్న 572 మంది కార్మికులు, ఉద్యోగులకు జీతాలు రాక ఆందోళనలకు గురవుతున్నారు. సుమారు రూ.90 లక్షల వరకు జీతాలు చెల్లించాల్సి ఉంది. మరో రూ.5లక్షల వరకు ప్రజాప్రతినిధులకు గౌరవ వేతనాలు ఇవ్వాల్సి ఉంది. వేతనాల కోసం కార్మికులు ఆందోళన చేసే అవకాశముంది. జిల్లా మంత్రి, స్థానిక ఎమ్మెల్యే, నగర మేయర్ జోక్యం చేసుకుంటేనే సమస్య పరిష్కారమయ్యే అవకాశముంది.

కలెక్టరేట్ల ముట్టడి.. తాగునీటి కట్టడి

- 21 నుంచి పంచాయతీ సిబ్బంది ఆందోళన తీవ్రతరం
- ఉద్యోగ భద్రత, వేతన స్థిరీకరణ, బకాయిల విడుదలకు డిమాండ్
- మల్టీపర్పస్ విధానాన్ని రద్దుచేయాల్సిందేనని స్పష్టీకరణ
- వెట్టిచాకిరీ నుంచి విముక్తి కల్పించాలని వేడుకోలు
- స్వచ్ఛ సర్వేక్షణ్‌కు ఆటంకాలు



ఎలిగేడులో ఆందోళన చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

జిల్లా	జీపీలు	మల్టీపర్పస్ వర్కర్లు
కరీంనగర్	313	1397
జగిత్యాల	380	1534
పెద్దపల్లి	266	1108
సిరిసిల్ల	255	1222
మొత్తం	1,214	5,261

సాక్షిప్రతినిధి, కరీంనగర్: న్యాయమైన డిమాండ్ల పరిష్కరించాలని గ్రామపంచాయతీ సిబ్బంది ప్రారంభించిన సమ్మెతీవ్రరూపం దాల్చనుంది. ఈనెల 21 నుంచి రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల ముట్టడికి కార్మిక, ఉద్యోగ సంఘాలు పిలుపునిచ్చాయి. ఇదే క్రమంలో అన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల ఇళ్ల ఎదుట ధర్నాలు చేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం పారిశుద్ధ్య కార్మికులు మాత్రమే పాల్గొంటున్న ఈ సమ్మెలో త్వరలో కారోబార్, బిల్ కలెక్టర్, పంప్ డ్రైవర్, ట్రాక్టర్ డ్రైవర్, ఎలక్ట్రీషియన్ సిబ్బంది పాల్గొనేందుకు సిద్ధంగా ఉన్నారని కార్మిక, ఉద్యోగ సంఘాల జేఏసీలు స్పష్టంచేస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 12,769 గ్రామపంచాయతీల్లోని దాదాపు 50 వేల మంది సిబ్బంది ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు పకడ్బందీ ప్రణాళిక రూపొందించారు.

పక్కా ప్రణాళికతో..

చాలాకాలంగా న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నా.. ఎలాంటి స్పందన లేకపోవడంతోనే తాముసమ్మెలోకి వెళ్లాల్సి వచ్చిందని కార్మిక సంఘాల నాయకులు స్పష్టంచేస్తున్నారు. 21న కలెక్టరేట్ల ముట్టడి అనంతరం గ్రామాల్లో తాగునీటి సరఫరా నిలిపివేయాలన్న ఆలోచనలో ఉన్నారు. వాస్తవానికి గ్రామపంచాయతీల్లో పనిచేసే సిబ్బందికి దాదాపు నాలుగు నెలలుగా వేతనాలు లేక అల్లాడుతున్నారు. దీనికి తోడు 12 రోజులుగా గ్రామపంచాయతీ సిబ్బంది సమ్మె చేస్తుండడంతో పల్లెల్లో పారిశుద్ధ్యం పేరుకుపోయి వ్యాధులు విజృంభించే అవకాశం ఉంది. ఇప్పుడే గ్రామపంచాయతీల్లో స్వచ్ఛ సర్వేక్షణ్ కింద ఎంపికైన గ్రామాల్లో సర్వే కొనసాగుతోంది. సర్వేకు సహకరించాల్సిన పంచాయతీ సిబ్బంది, జేపీఎస్‌లు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంటేనే స్వచ్ఛసర్వేక్షన్ సర్వే సజావుగా సాగనుంది. ఈ రెండింటిని దృష్టిలో ఉంచుకొని జిల్లా పంచాయతీ అధికారులు సమ్మె విరమించి విధుల్లోకి చేరాలని, జేపీఎస్‌ల క్రమబద్ధీకరణ అంశం రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ప్రక్రియ కొనసాగుతుందని డీపీవో వెల్లడిస్తూ వెంటనే విధుల్లోకి చేరేలా ఒత్తిడి తెస్తున్నారు.


ఎందుకు కష్టాలు?

వాస్తవానికి ప్రతీ గ్రామపంచాయతీలో సిబ్బంది విషయంలో రికార్డులో సగం, రికార్డులో లేకుండా సగం మంది పనిచేస్తున్నారు. రికార్డులో ఉన్నవారికి ప్రస్తుతం రూ.8,500, లేని వారికి రూ.7,000 లేదా అంతకంటే తక్కువ వేతనం చెల్లిస్తున్నారు. ఈ సమయంలో ప్రభుత్వం 2019లో ప్రభుత్వం జీవో నెం.51ని విడుదల చేయడం వీరికష్టాలను మరింత పెంచింది. ఈ జీవో ప్రకారం.. 500 మంది జనాభా ఉన్న గ్రామపంచాయతీకి ఒక ఉద్యోగిని తీసుకోవాలి. వారికి రూ.8,500 వేతనం చెల్లించాలి. అప్పటికి.. ఇప్పటికి జనాభా చాలా పెరిగింది. అందుకే, గ్రామపంచాయతీ అదనపు సిబ్బందిని తీసుకుంది. వారికి ఉన్నవారి వేతనాన్ని పంచుతు సర్దుబాటు చేస్తోంది. ఇది ఒకరకంగా వెట్టిచాకిరీ కిందకే వస్తుందని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. చాలాచోట్ల రూ.4 వేల కంటే తక్కువ వేతనం, సెలవులు లేకుండా విధులు నిర్వహిస్తున్నారు. ఉదాహరణకు 2001 జనాభా లెక్కల ప్రకారం.. 4000 జనాభా ఉన్నచోట ఎనిమిది మంది పనిచేయాలి. కానీ.. ఇపుడు ఆ గ్రామంలో జనాభా పదివేలకు చేరి ఉంటుంది. దీంతో 15 మంది వరకు సిబ్బంది అవసరం. దీంతో ఈ ఎనిమిదిమందికి రూ.8,500 చొప్పున రూ.68,000 వేతనం ఇవ్వాలి. కానీ.. రూ.4 వేల చొప్పున అదేవేతనాన్ని 15 మందికి పంచుతున్నారు. అంతేకాకుండా మల్టీపర్పస్ వర్కర్ విధానంతో అందరూ అన్నిపనులు చేయాలనడాన్ని కార్మికులు తప్పుబడుతున్నారు. విద్యావంతులు కారోబార్‌లుగా వ్యవహరిస్తున్నారు. కానీ.. వారితో మురికి కాలువలు తీయిస్తున్నారు. చాలాచోట్ల సర్పంచులు తమకునచ్చని కారోబార్లతో రోడ్లు ఊడ్పించడం, కాలువలు తీయించడం చేయిస్తున్నారు. దీంతో డిగ్రీ, పీజీ చదివిన కారోబార్ల ఆత్మగౌరవాన్ని ఇది దెబ్బతీస్తోంది. స్కిల్డ్ అన్ స్కిల్డ్‌ను ఒకే గాటిన కట్టడం సరికాదని వాదిస్తున్నారు. ఆకస్మికంగా మృతిచెందిన వారి కుటుంబాలకు ఎలాంటి పరిహారం అందడం లేదు. వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. దీంతో మల్టీపర్పస్ వర్కర్స్ నిరసనలు, దీక్షలు, ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతంచేసి ఇదే సమయంలో డిమాండ్లను పరిష్కరించుకునేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీవ్రతరం చేశారు.

డిమాండ్లు ఇవే...

- పంచాయతీ సిబ్బంది అందరినీ పర్మినెంట్ చేసి ప్రత్యేక బడ్జెట్ కేటాయించి వేతనాలు ఇవ్వాలి.
- మినిమం బేసిక్‌ను రూ.19 వేలుగా చెల్లించాలి. జీవో 60 ప్రకారం స్వీపర్లకు రూ.15600, పంప్ ఆపరేటర్లు, ఎలక్ట్రీషియన్లు, కారోబార్, బిల్లు కలెక్టర్లకు రూ.19,500 చెల్లించాలి.
- ప్రమాదంలో మరణించిన సిబ్బందికి రూ.10 లక్షల నష్టపరిహారం చెల్లించాలి.
- ప్రమాదంలో మరణించిన కార్మికుని దహన సంస్కారాలకు రూ.30 వేల ఆర్థికసాయం. కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం, ఇన్సూరెన్స్ సౌకర్యం వర్తింపజేయాలి.
- ఎనిమిది గంటల పనిదినాన్ని అమలుచేస్తూ వారంతపు సెలవులు, పండుగ సెలవులు అమలు చేయాలి.
- ఆదాయం ఉన్న పంచాయతీల్లో వేతనాల పెంపునకు అనుమతి ఇవ్వాలి.
- ట్రాక్టర్ డ్రైవర్లకు పంచాయతీల ద్వారానే డ్రైవింగ్ లైసెన్స్‌లు ఇప్పించాలి.
- అకారణంగా కార్మికులను తొలగించే కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు మానుకునేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.


ప్రభుత్వం దిగొచ్చేవరకూ ఉద్యమం



గ్రామపంచాయతీల్లో మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని అమలు చేస్తూ కార్మికులను శ్రమను దోచుకుంటున్న ప్రభుత్వం సమానపనికి సమాన వేతనం ఇవ్వాల్సిందే. 12 రోజులుగా సమ్మెచేస్తున్నా.. ప్రభుత్వం న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాల్సింది పోయి.. బెదిరింపులకు పాల్పడటం అప్రజాస్వామికం. ప్రభుత్వం దిగివచ్చే వరకు సమ్మెను ఉధృతం చేస్తాం.

– కొప్పుల శంకర్, గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మిక సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్

ఉద్యోగులుగా గుర్తించాలి



మానకొండూరు గ్రామపంచాయతీలో 14 సంవత్సరాల నుంచి చాలీచాలని వేతనంతో జీవనం సాగిస్తున్నా.. ఇద్దరు పిల్లలు.. వచ్చే జీతం ఎటు సరిపోవడం లేదు. ప్రభుత్వం మా కష్టానికి తగ్గట్టుగా జీతం పెంచడంతో పాటు మమ్ముల్ని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి.

– జి.జగదీశ్వర్, జీపీ ఎలక్ట్రిషియన్, మానకొండూర్

క్లుప్తంగా

19 నుంచి శ్రీశైలంకు సూపర్ లగ్జరీ బస్సులు

గోదావరిఖనిటౌన్: ఈనెల 19 నుంచి గోదావరిఖని నుంచి శ్రీశైలం దేవస్థానానికి రెండు సూపర్‌లగ్జరీ బస్సులు నడపనున్నట్లు డిపో మేనేజర్ పి.మల్లేశం తెలిపారు. మొదటి సర్వీసు గోదావరిఖని బస్‌స్టేషన్ నుంచి ఉదయం 5.30గంటలకు బయలుదేరి పెద్దపల్లి, కరీంనగర్, హైదరాబాద్ మీదుగా సాయంత్రం 5.15 గంటలకు శ్రీశైలం చేరుకుంటుందన్నారు. రెండవ సర్వీసు రాత్రి 9గంటలకు బయలుదేరి ఉదయం 8.45 గంటలకు శ్రీశైలం చేరుకుంటుందని తెలిపారు. అలాగే శ్రీశైలం నుంచి మొదటి సర్వీసు ఉదయం10.15 గంటలకు, రెండో సర్వీసు రాత్రి 7.20గంటలకు గోదావరిఖనికి బయలుదేరుతాయని పేర్కొన్నారు. ప్రయాణికులు ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ చేసుకోవచ్చని, గోదావరిఖని నుంచి 7281, 7283, శ్రీశైలం నుంచి 7282, 7284 నంబర్ల ద్వారా ముందస్తు రిజర్వేషన్ చేసుకోవాలని కోరారు.

అనారోగ్యంతో కార్పొరేటర్ తల్లి మృతి


మోతే (ఫైల్)

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ పరిధిలోని యైటింక్లయిన్‌కాలనీ 15వ డివిజన్ కార్పొరేటర్ బదావత్ శంకర్ నాయక్ తల్లి మోతే (90) సోమవారం అనారోగ్యంతో మృతి చెందింది. వారి స్వగ్రామం ధర్మారంలో అంత్యక్రియలను నిర్వహించారు. కాలనీలోని కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు మృతురాలి కుటుంబసభ్యులను పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో కోతి..

- అంత్యక్రియలు చేసిన గ్రామస్తులు


అంత్యక్రియలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలంలోని పెద్దకల్వల గ్రామంలో రాజీవ్ రహదారిపై టాటాఏస్ వాహనం ఢీకొని, ఓ కోతి మృతిచెందింది. సర్పంచ్ కారెంగుల రమేశ్, ఉపసర్పంచ్ అర్కుటి సంతోష్, స్థానికులు వానరానికి అంత్యక్రియలు చేయాలని నిర్ణయించారు. డప్పుచప్పుళ్ల మధ్య బాణాసంచా కాలుస్తూ అంత్యక్రియలు జరిపారు. కార్యక్రమంలో హనమాన్ ఆలయ కమిటీ చైర్మన్ రమేశ్, గుండవేన స్వామి, నర్ల మల్లేశ్, శ్రీనివాస్, రవి, చంద్రకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రచయితల వేదిక జిల్లా నూతన కార్యవర్గం

పెద్దపల్లిరూరల్: తెలంగాణ రచయితల వేదిక జిల్లా నూతన కార్యవర్గాన్ని సోమవారం పెద్దపల్లిలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జీగురు రవీందర్, ప్రధాన కార్యదర్శిగా జింకల వెంకటేశ్, ప్రచార కార్యదర్శిగా గుండు రమణయ్య, మహిళా కార్యదర్శిగా అనాసి జ్యోతి, సహాయ కార్యదర్శిగా కందుకూరి భాస్కర్ ఎన్నికయ్యారు.

కొనసాగుతున్న ఆపరేషన్ ముస్కాన్

- పని ప్రదేశాల్లో ఆకస్మిక తనిఖీలు చేస్తున్న అధికారులు
- జిల్లాలో ఏడేళ్లలో 664 మంది బాలకార్మికుల గుర్తింపు

జిల్లాలో గుర్తించిన బాల కార్మికుల వివరాలు

ఏడాది	ఆపరేషన్ స్మైల్	ఆపరేషన్ ముస్కాన్
2017	97	96
2018	35	57
2019	44	98
2020	74	04
2021	101	-
2022	15	42
2023	01	-
మొత్తం	367	297


తనిఖీలు చేస్తున్న ఆపరేషన్ ముస్కాన్ అధికారులు

పిల్లలను బడికి పంపాలి

బడీడు పిల్లలను తప్పనిసరిగా బడికి పంపాలి. బాలలతో పనులు చేయిస్తూ పట్టుబడిన వారిపై చట్టరీత్యా చర్యలుంటాయి. పిల్లలతో పనులు చేయించి, వారి బంగారు భవిష్యత్తును అంధకారం చేయొద్దు.
– సుగుణ, బాలల పరిరక్షణ సమితి అధికారిణి

పెద్దపల్లిరూరల్: బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలన్న లక్ష్యంతో ఆపరేషన్ ముస్కాన్, ఆపరేషన్ స్మైల్ ఏడేళ్ల క్రితం అమల్లోకి వచ్చాయి. అధికారుల ప్రత్యేక బృందాలు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ కేసులు నమోదు చేస్తున్నాయి. అయినా పరిశ్రమలు, హోటళ్లు, వర్క్‌షాపులు, వ్యాపార, వాణిజ్యసంస్థల యాజమాన్యాలు ఇప్పటికీ బాలలతో పనులు చేయిస్తూ అధికారులకు పట్టుబడుతున్నారు.

ఏటా రెండుసార్లు తనిఖీలు..

బడికి వెళ్లాల్సిన చిన్నారులు బాల కార్మికులుగా మారకుండా కట్టడి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం 2015 నుంచి ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ పేరిట ప్రత్యేక అధికారుల బృందాలను నియమించి, తనిఖీలను నిర్వహించేలా చర్యలు చేపట్టింది. ఏటా జనవరి 1 నుంచి నెలరోజుల పాటు ఆపరేషన్ స్మైల్, జూలై 1 నుంచి నెలాఖరు వరకు ఆపరేషన్ ముస్కాన్ చేపడుతారు. పోలీసు, కార్మిక శాఖలు, బాలల పరిరక్షణ విభాగం, ఐసీడీఎస్ అధికారులతో ఏర్పాటైన ఈ బృందాలు తనిఖీ సమయాల్లో గుర్తించిన బాలకార్మికులకు విముక్తి కలిగించడంతోపాటు పనులు చేయించుకుంటున్న యజమానులపై కేసులు నమోదు చేస్తున్నారు.

జిల్లాలో తనిఖీలు ముమ్మరం

పెద్దపల్లి జిల్లాలో ఈ నెల 1 నుంచి మొదలైన ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంలో భాగంగా అధికారుల బృందాలు తనిఖీలను ముమ్మరం చేశాయి. ఇటీవలే డీసీపీ వైభవ్‌గైక్వాడ్ పోలీసు అధికారులతో సమావేశమై, బాల కార్మికుల గుర్తింపు, ఆ వ్యవస్థ నియంత్రణకు అనుసరించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించారు. జిల్లాలోని ఇటుకబట్టీలు, హోటళ్లు, మెకానిక్ షాపులు, పరిశ్రమలు, మిల్లులు తదితర పని ప్రదేశాల్లో ఆకస్మికంగా పర్యటిస్తున్నారు. అయితే తనిఖీల్లో ఎక్కువగా మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల నుంచి వచ్చిన వలస కూలీల పిల్లలే కనిపిస్తున్నారు. బాలలతో పని చేయించడం నేరమని తల్లిదండ్రులకు, యజమానులకు కౌన్సెలింగ్ చేస్తున్నారు.

మురుగు కాల్వపై వివాదం

- ఇద్దరు ప్రజాప్రతినిధుల మధ్య కోల్డ్‌వార్
- కాల్వ కబ్జా చేశారని స్థానికుల ఆగ్రహం

కోల్‌సిటీ: గోదావరిఖని ఎన్టీఆర్ నగర్‌లోని ఓ మురుగు కాల్వపై వివాదం నెలకొంది. సోమవారం స్థానిక ఇద్దరు అధికార పార్టీ ప్రజాప్రతినిధుల మధ్య ఈ విషయమై కోల్డ్‌వార్ జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. కాల్వలో మురుగు నీటి ప్రవాహానికి అడ్డుగా ఓ ప్రజాప్రతినిధి మట్టి పోశాడు. దీంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు సమీపంలోని ఇళ్లలోకి మురుగు, వరద నీరు చేరింది. స్థానికులు కాల్వలో మురుగునీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలంటూ ఆందోళన చేపట్టారు. 50 ఏళ్లనాటి కాల్వను కబ్జా చేశారని, మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మురుగునీటి ప్రవాహానికి అడ్డుగా పోసిన మట్టిని మరో ప్రజాప్రతినిధి జేసీబీ సహాయంతో తొలగించారు. మట్టి పోసిన ప్రజాప్రతినిధి మాత్రం తాను కొనుగోలు చేసిన స్థలం నుంచి ప్రవహిస్తున్న కాల్వతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు. సొంత డబ్బులతో కాల్వ నిర్మాణం చేపట్టడానికే అడ్డుగా మట్టి పోసినట్లు పేర్కొన్నారు. నగరపాలక సంస్థ అధికారులు జోక్యం చేసుకొని, సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

మా భూమి మాకే కావాలి

- ఎక్లాస్‌పూర్‌లో ఎస్సీల డిమాండ్


నిరసన తెలుపుతున్న ఎక్లాస్‌పూర్ ఎస్సీలు

మంథని: 30 ఏళ్ల క్రితం తమకు కేటాయించిన భూమిని వేరే వారికి కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని మంథని మండలంలోని ఎక్లాస్‌పూర్ ఎస్సీలు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం గ్రామంలోని సర్వే నంబర్ 32లో చదును చేస్తున్నారన్న సమాచారం మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ త్రివేణి పోలీసులతో అక్కడికి చేరుకున్నారు. భూమిలో ఎలాంటి నిర్మాణాలు చేయవద్దని, అర్హులుంటే ఈ నెల 19వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇప్పటికే 70 ప్లాట్లలో 26 మందికి పట్టాలిచ్చినట్లు పేర్కొన్నారు. 40 మందిమి ఈ భూమిని కాపాడుకుంటూ వస్తున్నామని, మా భూమి మాకే కావాలని, మరొకరికి కేటాయించొద్దని డిమాండ్ చేశారు.

మృతుడి కుటుంబానికి రూ.20 లక్షలివ్వాలి

- మానవ హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంబుజారావు


వివరాలు సేకరిస్తున్న అంబుజారావు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని కిష్టంపేట ఇసుక క్వారీ కోసం తవ్విన గుంతలో పడి మృతిచెందిన చిన్నరాతుపల్లివాసి బండి కొమురయ్య కుటుంబసభ్యులకు రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని మానవ హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంబుజారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మృతుడి కుటుంబీకులను పరామర్శించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. కిష్టంపేట మానేరు నదిలో ఇసుక క్వారీ గుంతలను పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇసుక క్వారీలకు అనుమతి ఇవ్వడంపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ అభ్యంతరం చెప్పినా యథేచ్ఛగా దందా సాగించడం ఏంటని మండిపడ్డారు. కొమురయ్య మృతికి కారణమైన క్వారీ నిర్వాహకుడిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలన్నారు. ఈ ఘటనను సుమోటో కేసుగా పరిగణలోకి తీసుకోవాలని, సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరారు. మీర్జంపేట ఎంపీటీసీ సభ్యుడు గూడెపు జనార్దన్ రెడ్డి, దళిత ఫెడరేషన్ ఫ్రంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మార్వాడి సుదర్శన్, మానవ హక్కుల వేదిక నాయకురాలు సుగుణ, సుజాతఖాన్, వెంకటేశ్వర్‌రావు, రమేశ్, అజయ్, కుమార్ తదితరులున్నారు.

మధ్యాహ్నభోజన కార్మికుల సమ్మె విరమణ


కార్మికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

పెద్దపల్లిరూరల్: సీఎం కేసీఆర్ కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తున్నారని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ మధ్యాహ్నభోజన వర్కర్లు చేస్తున్న నిరవధిక దీక్ష శిబిరానికి చేరుకుని వారితో మాట్లాడారు. ప్రతినెలా రూ.2వేల వేతనాన్ని పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిందని వివరించారు. అనంతరం కార్మికులతో సమ్మెను విరమింపజేశారు. వేతనాలు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం సంతోషకరమని, మిగతా సమస్యల పరిష్కారానికీ చొరవ చూపాలని వర్కర్ల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పూసాల రమేశ్ అన్నారు. లావణ్య, కళావతి, భాగ్యలక్ష్మి, జుబేదా, పిడుగు గట్టయ్య, జంగం లక్ష్మి తదితరులున్నారు.

పనిచేస్తూనే పోరాడండి..

గ్రామ పంచాయతీల్లో తమ విధులు నిర్వర్తిస్తూనే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తేవాలని ఎమ్మెల్యే అన్నారు. పంచాయతీ కార్మికుల దీక్షా శిబిరాన్ని సందర్శించారు. ప్రభుత్వం సమస్య పరిష్కరిస్తుందని, సమ్మె విరమించాలని సూచించారు. అయితే పరిష్కరించేవరకూ సమ్మెలోనే ఉంటామని కార్మికులు తెలిపారు.

జీవితంపై విరక్తితో వృద్ధుడి ఆత్మహత్య


పోచయ్య (ఫైల్)

ధర్మారం: మండలంలోని కానంపెల్లి గ్రామానికి చెందిన వేల్పుల పోచయ్య (60) అనే సింగరేణి రిటైర్డ్ కార్మికుడు ఆత్మహత్యాయత్నం చేయగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై సత్యనారాయణ వివరాల ప్రకారం.. పోచయ్య సింగరేణి కార్మికుడిగా పని చేసి, రెండేళ్ల క్రితం రిటైర్మెంట్ పొంది, స్వగ్రామం వచ్చాడు. ఆయనకు ముగ్గురు కుమారులు కాగా భార్య 16 ఏళ్ల క్రితమే చనిపోయింది. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది, ఆదివారం సాయంత్రం ఇంట్లో ఉన్న క్రిమిసంహారక మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పోచయ్య చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడి కుమారుడు మల్లేశం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జగిత్యాలలో వ్యభిచారం గుట్టు రట్టు

- ఆరుగురి అరెస్టు

జగిత్యాల క్రైం: జగిత్యాల పట్టణ శివారులోని అంతర్గాం రోడ్‌లో వ్యభిచారం నిర్వహిస్తున్న ఇద్దరితోపాటు ముగ్గురు యువతులు, ఒక విటున్ని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ నటేశ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. సోమవారం మధ్యాహ్నం అంతర్గాం రోడ్‌లోని ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్నారని పోలీసులకు పక్కా సమాచారం వచ్చింది. వెంటనే తనిఖీలు చేపట్టగా వ్యభిచారం నిర్వహిస్తున్న ఇద్దరితోపాటు ముగ్గురు యువతులు, ఒక విటుడు పట్టుబడ్డారు. వారిని అరెస్టు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెగడపల్లి(ధర్మపురి): మండలంలోని వెంగళాయిపేట గ్రామానికి చెందిన ఆత్మకూరి స్వామి(52) చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 2న రాత్రి వెంగళాయిపేట ప్రధాన రహదారిపై నడుచుకుంటూ వెళ్తున్న స్వామిని అదే గ్రామానికి చెందిన చెట్ల శ్రీనివాస్ బైక్‌పై వచ్చి, ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఇద్దరూ గాయపడి, చికిత్స నిమి త్తం కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రిలో చేరారు. అక్కడ చికిత్స పొందుతూ స్వామి సోమవారం మృతిచెందాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు.



ఘనంగా మైసమ్మ బోనాలు

యైటింక్లయిన్‌కాలనీ: స్థానిక స్పందన మోడల్ స్కూల్ యాజమాన్యం ఆధ్వర్యంలో సోమవారం మైసమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు బోనాలతో తెలంగాణ చౌరస్తాకు చేరుకున్నారు. పోతురాజుల వేషధారణలో వారు చేసిన నృత్యాలను ఆకట్టుకున్నాయి. పాఠశాల ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. పాఠశాల హెచ్‌ఎం రవీందర్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సివిల్ పనులు సకాలంలో పూర్తవ్వాలి


మాట్లాడుతున్న జీఎం మనోహర్

- ఆర్జీ–2 జీఎం ఎ.మనోహర్

గోదావరిఖని: ఆర్జీ–2 ఏరియాలోని సివిల్ పనులు సకాలంలో పూర్తవ్వాలని జీఎం ఎ.మనోహర్ అన్నారు. సోమవారం తన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బేస్‌వర్క్ షాప్‌లోని అన్ని సెక్షన్లకు షెడ్ల నిర్మాణం త్వరగా చేపట్టాలన్నారు. కృషిభవన్ వద్ద యంత్రాల మరమతుకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ప్రాజెక్టు అధికారి మధుసూదన్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్ని కార్మిక సంఘాలతో చర్చించాలి

- ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి టి.శ్రీనివాస్


మాట్లాడుతున్న శ్రీనివాస్

గోదావరిఖని: గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగేంత వరకు అన్ని కార్మిక సంఘాలతో సింగరేణి యాజమాన్యం చర్చలు జరపాలని ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి టి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం గోదావరిఖనిలోని యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నెలలో హైదరాబాద్‌లోని డిప్యూటీ లేబర్ కమిషనర్ సమక్షంలో 15 రిజిస్టర్డ్ కార్మిక సంఘాలతో సమావేశం జరిగిందన్నారు. ఎన్నికలు జరిగేంత వరకు ఆయా సంఘాలతో చర్చించాలని కోరారు. సమావేశంలో నాయకులు ఐ.కృష్ణ, చాంద్‌పాషా, నరేశ్, మల్లేశ్, బి.అశోక్, బి.అశోక్, కొప్పుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జీడీకే–2,2ఏ గని సందర్శన


పని స్థలాలకు వెళ్తున్న జీఎం శ్రీనివాస్

గోదావరిఖని: సింగరేణి ఆర్జీ–1 పరిధిలోని జీడీకే –2,2ఏ గనిని జీఎం చింతల శ్రీనివాస్ సోమవారం సందర్శించారు. గనిలోని 4 సీమ్ 4/16 ప్యానెల్‌ను అధికారులతో కలిసి పరిశీలించారు. బొగ్గు ఉత్పత్తికి సంబంధించి రక్షణపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో గ్రూప్ ఏజెంట్ చంద్రశేఖర్, అధికారులు అల్లం ఓదెలు, తిరుపతి పాల్గొన్నారు.

చెక్‌పోస్టు విధుల్లో అధికారి బంధువు

- అనారోగ్యంతోనే ఆలస్యమైందన్న ఎఫ్‌ఆర్‌వో
- అధికారుల ఇష్టారాజ్యం
- ఇక్కడ అలవాటే అంటున్న స్థానికులు
- తూర్పు నుంచి దాటుతున్న కలప, సరుకులు



అటవీ శాఖ తనిఖీ కేంద్రంలో విధుల్లో ఓ అధికారి బంధువు, పక్కనున్నది లోపల కూర్చున్న వ్యక్తే

మంథని: మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి గోదావరి, ప్రాణహిత నదులు దాటి ఉమ్మడి కరీంనగర్ తూర్పు అడవుల నుంచి కలప అక్రమంగా తరలిపోకుండా నివారించేందుకు మంథని మండలంలోని ఎక్లాస్‌పూర్ వద్ద అటవీ శాఖ చెక్‌పోస్టు చేశారు. అయినా అక్రమార్కులు దాన్ని అవలీలగా దాటుతున్నారన్న ఆరోపణలున్నాయి. ఇందుకు అనేక సంఘటనలు సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. సోమవారం చెక్‌పోస్టు వద్ద బీట్ ఆఫీసర్ రామ్మూర్తి విధులు నిర్వహించాల్సి ఉండగా ఆయనకు బదులు ఓ ఎఫ్‌ఎస్‌వో స్థాయి అధికారి బంధువు విధుల్లో ఉన్నాడు. కాగా అధికారికి బదులు ప్రైవేటు వ్యక్తి కుర్చీలో కూర్చున్న సమాచారం మీడియాకు చేరడంతో అక్కడికి వెళ్లి అడగ్గా సెక్షన్ అధికారి బంధువునంటూ మెల్లగా లేచి వెళ్లిపోయాడు. ఉదయం 9 గంటల నుంచే బీట్ ఆఫీసర్ రామ్మూర్తి చెక్‌పోస్టు వద్ద ఉండాల్సి ఉండగా మధ్యాహ్నం 12 దాటినా పత్తాలేడు. ఈయన జమ్మికుంట నుంచి విధులకు హాజరుతున్నట్లు సమాచారం. ఇక్కడ విధులు నిర్వహించే అధికారులకు ఇది అలవాటేనని స్థానికులు అంటున్నారు. చెక్‌పోస్టు వద్ద ఇష్టారీతిన విధులు నిర్వర్తించడం వల్ల కలప, ఇతర సరుకుల అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోందని తెలిసింది. అటవీ శాఖకు సంబంధం లేని వ్యక్తులు విధుల్లో ఉండటం, ఉన్నవారు కూడా చూసీచూడనట్లుగా వ్యవహరిస్తారన్న విమర్శలున్నాయి. చాలా సందర్భాల్లో చెక్‌పోస్టు వద్ద వాహనాలు ఆగకుండానే వెళ్తాయని, ఇందుకు అక్రమార్కులు కొంతమంది అధికారులకు మామూళ్లు ముట్టజెబుతున్నట్లు సమాచారం. కాగా చెక్‌పోస్టు వద్ద బీట్ ఆఫీసర్‌కు బదులుగా ఓ అధికారి బంధువు విధుల్లో ఉన్న విషయమై మంథని అటవీశాఖ రేంజ్ అధికారి శ్రీనివాస్‌ను వివరణ కోరగా బీట్ ఆఫీసర్ రామ్మూర్తి అనారోగ్యం కారణంగా ఆలస్యంగా వచ్చారని తెలిపారు. సిబ్బంది కొరత ఉందన్నారు. డీజిల్ పోసుకునేందుకు వచ్చిన వ్యక్తి అక్కడ వేచివున్నాడని, విధులు చూసుకోలేదని పేర్కొన్నారు.